

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :188 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 17-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక వైద్య శిబిరాలు ప్రారంభం



కరీంనగర్,హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయక ఉపకరణాలు అందించేందుకు అలింకో సంస్థ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అలింకో సంస్థ ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.అలింకో సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాల ద్వారా అర్హులను గుర్తించి వారికి అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు, చేతి కర్రలు, వీల్‌చైర్లు, మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు తదితర సహాయక ఉపకరణాలను ఉచితంగా అందజేస్తామని వెల్లడించారు.సోమవారం సైదాపూర్‌లో ప్రారంభమైన శిబిరాలు నేడు ఎల్కతుర్తి, 18న భీమదేవరపల్లి, 20న కోహెడ, 21న చిగురుమామిడి మండలాల్లో నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 25, 26, 27 తేదీల్లో హుస్నాబాద్ మండలంతో పాటు పట్టణంలో శిబిరాలు నిర్వహించి, అనంతరం అక్కన్నపేట మండలంలో కూడా ఈ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. చేయూత పథకం లబ్ధిదారులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని చెప్పారు.ప్రభుత్వం మంచి ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలి



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఒకే చోట 23 ఎకరాల భూమిని కేటాయించి, క్యాబినెట్ ఆమోదంతో జీవో జారీ చేశామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని, వివిధ రాజకీయ పక్షాలతో కలిసి తన సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఖమ్మం కలెక్టరేట్ ప్రారంభోత్సవ సభలో 4 లక్షల మంది సాక్షిగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అప్పటి మంత్రి హరీశ్ రావు, తాను ప్రత్యేక చొరవ తీసుకుని ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే (ఎస్సార్ గార్డెన్ వెనుక నుండి వెంకటాయపాలెం వరకు) 23 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. రెవెన్యూ సర్వే, మార్కింగ్, ల్యాండ్ ఏలియనేషన్ పూర్తి చేసి, జర్నలిస్టుల సొసైటీకి అప్పగించడంతో పాటు అంతర్గత రోడ్లు, వీధి దీపాల కోసం సుడా నుండి రూ. 2 కోట్లు కూడా మంజూరు చేశామని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా, నేటికీ జర్నలిస్టుల పేరు మీదనే ఆ 23 ఎకరాలు ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లుగా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. గతంలో కేటాయించిన భూమిలో 8 ఎకరాలకు ఫెన్సింగ్ వేసి 'ప్రభుత్వ భూమి' అని బోర్డులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మూడు నెలల క్రితం ఇచ్చిన హామీ ఏమైంది..వైరా, చింతకాని సభల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మూడేళ్లు గడిచిపోయాయని విమర్శించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ముఖ్యంగా సమాచార శాఖ మంత్రి మన జిల్లా నుండే ఉన్నప్పటికీ జర్నలిస్టుల పట్ల కనీస సానుభూతి చూపకపోవడం శోచనీయమన్నారు.ప్రభుత్వాలు మారినా ప్రజలకు, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు మారకూడదని, కడుపులో ప్రేమ, గుండెల్లో ఆర్ద్రత ఉంటే 24 గంటల్లో ఈ సమస్య పరిష్కారమవుతుందని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల హామీలుగా దీనిని మళ్లీ వాయిదా వేయకుండా తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అప్పగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ - టీజెఫ్ ' అధ్యక్షులు చిర్రా రవి, ఆకుతోట ఆదినారాయణ, సాంబశివరావు, ప్రశాంత్, శ్రీనివాస్,నాయకులు ఖమర్, పగడాల నాగరాజు,పిన్ని కోటేశ్వరరావు, ఎండీ పాషా, దడాల రఘు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టీజీపీఎస్సీ అదిరిపోయే శుభవార్త.. 6 నెలల్లోనే ఉద్యోగం..



హైదరాబాద్,తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్ న్యూస్ తెలిపింది. గతంలో మాదిరిగా ఏళ్ల తరబడి ఫలితాల కోసం వేచి చూసే పరిస్థితికి స్వస్తి పలుకుతూ కమిషన్ నియామక ప్రక్రియలో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేస్తోంది. కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలు ముగిసిన కేవలం మూడు వారాల్లోపే తుది ఫలితాలను వెల్లడించనున్నారు. నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థుల చేతికి నియామక ఉత్తర్వులు అందే వరకు మొత్తం ప్రక్రియను గరిష్ఠంగా ఆరు నెలల్లోపే పూర్తి చేయాలని కమిషన్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.కొత్త విధానంలో సమయ పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏదైనా ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి సరిగ్గా ఒక నెల సమయం కేటాయిస్తారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తర్వాత అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు రెండు నెలల సమయం ఇస్తారు. అనంతరం పరీక్ష తేదీలను ప్రకటించిన 25 రోజుల్లోపే కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహిస్తారు. దీనివల్ల అభ్యర్థులకు షెడ్యూల్ ఉండటంతో పాటు నియామక ప్రక్రియలో ఆలస్యం పూర్తిగా నివారిస్తారు.ఈ నూతన విధానాన్ని టీజీపీఎస్సీ ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేసింది. అయితే తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, రోడ్లు, భవనాల శాఖలలో చేపట్టిన నియామకాలను అత్యంత వేగంగా పూర్తి చేసింది. ముఖ్యంగా పీసీబీలో అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టుల కోసం గత నెల 24వ తేదీన సీబీఆర్‌టీ పరీక్ష నిర్వహించగా.. కేవలం మూడు వారాల్లోపే ప్రాథమిక కీ విడుదల, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసి తుది ఎంపిక జాబితాను ప్రకటించారు. భవిష్యత్తులో నిర్వహించే అన్ని నియామక పరీక్షలకు ఇదే వేగవంతమైన విధానాన్ని అనుసరిస్తామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు.నియామక ప్రక్రియలో ఎటువంటి న్యాయపరమైన చిక్కులు, వివాదాలు తలెత్తకుండా కమిషన్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటోంది. ఒకే దశలో పరీక్షలు ఉండే నియామకాలను మూడు నెలల్లోపు, రెండు దశల్లో పరీక్షలు ఉండే వాటిని ఆరు నెలల్లోపు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. పరీక్షలు పూర్తిగా కంప్యూటర్ ఆధారితంగా జరగడం వల్ల మూల్యాంకనం సులభతరం కావడంతో పాటు ఫలితాల విడుదల వేగవంతమైంది. పరీక్ష ముగిసిన వెంటనే సమగ్రమైన ప్రాథమిక సమాధానాల కీని విడుదల చేయడం, అభ్యంతరాలను స్వీకరించడం వంటి పనులను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం జరుగుతున్న ఇతర నియామకాలు కూడా ఇదే వేగంతో కొనసాగుతున్నాయి. పీసీబీ ఎనలిస్ట్ గ్రేడ్-2 పోస్టులకు ఈ నెల 12, 13 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి కాగా, 14వ తేదీనే తుది జాబితాను విడుదల చేసి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే.. అక్టోబర్ 26న జరిగిన పీసీబీ అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్షకు సంబంధించి ఈ నెల 18, 19 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. ఆ తర్వాత రెండు మూడు రోజుల్లోనే తుది ఫలితాలు రానున్నాయి.ఇక ఈ నెల 6, 7 తేదీల్లో సీబీఆర్‌టీ పద్ధతిలో నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షల ప్రాథమిక కీ ఇప్పటికే విడుదలైంది. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 17వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు.

హరీష్ రావుకు కోలుకోలేని దెబ్బ.. కవిత సంచలన వ్యూహం!



హైదరాబాద్,టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి హరీష్ రావు పై మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. హరీష్ రావు అవినీతిపై సీఎంకు అన్ని ఆధారాలు అందజేస్తామని అన్నారు. విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీసీఐడీ లేఖల ద్వారా అన్ని ఆధారాలు అందజేస్తున్నామని, హరీష్ రావును ప్రజాక్షేత్రంలో లోనే ఎండగట్టడం కాకుండా లీగల్ వెళుతున్నా అంటూ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.

నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్..

కరప్షన్ ఎవరు చేసిన నిగ్గు తెలాల్సిందేనని.. తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని అన్నారు. కరువు మండలాలుగా ప్రకటించాలని, ఎకరానికి 25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్ర చరిత్రలో పంటలు వేయవద్దని చెప్పిన ఘనత రేవంత్ దేనని ప్రధాని మోడీని కలిసిన రేవంత్ కరువును ప్రస్థావించలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంట్రాక్ట్‌లు తప్ప పనికి వచ్చే పనులకోసం మాట్లాడలేదని కవిత క్లారిటీ ఇచ్చారు.

రౌండ్ టేబుల్ సమావేశం..

ఇంటర్ బోర్డు రద్దు పై రౌండ్ టేబుల్ సమావేశం జరగాలని కవిత డిమాండ్ చేశారు. భైరవ యాత్ర సిద్ధం అవుతుందని దీనికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలందరికీ ఉచిత విద్య ఉచిత వైద్యం కోసం మా యాత్ర చేస్తున్నామని కవిత అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిరుద్యోగులను మోసం చేశాడు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

మోడీతో రాహుల్ అలా...కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఇలా !



న్యూఢిల్లీ,ప్రధానమంత్రి నరేంద్ర మోడీలో ఆకర్షణ మంత్రం ఏదో ఉంది. ఆయన అందుకే ఈ రోజుకీ ఓటమి ఎరగని నేతగా ఉన్నారు. పాతికేళ్ళ పాటు ప్రభుత్వ సారధిగా ఉన్నారు. అందులో పదమూడేళ్లు ముఖ్యమంత్రిత్వం ఉంటే మరో పన్నెండేళ్ళు ప్రధానమంత్రి త్వం ఉంది. ఇక మోడీ ముఖ్యమంత్రి నుంచి ప్రధాని అయ్యారు. అయితే ఆయన తన పర భేదాలు లేకుండా వివిధ పార్టీల ముఖ్యమంత్రులకు అపాయింట్మెంట్లు ఇస్తారు. వారితో ప్రత్యేకంగా భేటీ అవుతారు. ఆయా రాష్ట్రాలకు వెళ్ళినపుడు వారితో కలిసి వేదికల మీద ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా సంభాషిస్తారు. అభివృద్ధి మంత్రంతో పాటు మోడీ మంత్రం కూడా ఇందులో ఉంది అని అంతా అంటారు.

రేవంత్ తో గంట సేపు :

ఇదిలా ఉంటే తాజాగా ఢిల్లీలో నరేంద్ర మోడీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంట సేపు పైగా భేటీ అయి అనేక అంశాల గురించి చర్చించడం రాజకీయంగా ఆసక్తిని పెంచుతోంది. ఒక ప్రధాని ఒక ముఖ్యమంత్రి కలిసి చర్చించడంలో ఆసక్తి ఏమి ఉంటుంది అనుకోవచ్చు. నిజమే సమాఖ్య వ్యవస్థలో ప్రధానితో ముఖ్యమంత్రుల సమావేశాలు సహజమైనవి. అయితే ఇందులో కూడా రాజకీయ పరమైన అంతరాలు ఉంటాయని గత అనుభవాలు నిరూపించాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులకు సాధారణంగా ప్రధానులు ఎక్కువ సమయం ఇవ్వరని కూడా ఉంది. అందుకే చెప్పాల్సింది ఏదో చెప్పేసి వారు చెప్పేసి వెళ్తారు. కానీ కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్ రెడ్డికి ప్రధాని గంటకు పైగా సమయం కేటాయించారు. ఈ ఇద్దరి భేటీలో ఖేలో ఇండియా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరు కావాలని నరేంద్ర మోడీని రేవంత్ మోదీని ఆహ్వానించారని తెలుస్తోంది. అలాగే తెలంగాణాలో ఎల్ నినో తో 161 మండలాలు తీవ్ర కరువుతో ఇబ్బంది పడుతున్నాయని మోడీ దృష్టికి రేవంత్ రెడ్డి తెచ్చారు. తమ రాష్ట్రాన్ని అన్ని విధాలుగానూ, ఆర్థికంగానూ ఆదుకోవాలని రేవంత్ రెడ్డి ప్రధానికి వినతి చేసారు. రేవంత్ రెడ్డి వినతులకు మోడీ సానుకూలంగా స్పందించారు అని చెబుతున్నారు.

డీకే సైతం :

ఇక కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా తన రాష్ట్రానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీతో వేదిక పంచుకుని ఎన్నో విషయాలను ముచ్చటించారు. తమ రాష్ట్ర సమస్యలను కూడా మోడీకి వివరించినట్లుగా డీకే శివ కుమార్ చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని తో కలిసి పనిచేస్తామని కూడా డీకే స్పష్టం చేశారు. ఇక మోడీతో డీకే సరదాగా సంభాషించిన దాని మీద కూడా మీడియాలో చర్చ వచ్చింది. అయినా సరే సమాఖ్య వ్యవస్థలో ఇది అవసరం అని డీకే క్లారిటీ ఇచ్చారు.

మోడీ అంటేనే మరి :

ఇదిలా ఉంటే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మోడీ అంటేనే మండిపడుతూంటారు. అయిన దానికీ కానిదానికీ మోడీని మధ్యలోకి తెచ్చి మరీ విమర్శిస్తారు అని అంటారు. మోడీని ఆయన అనేక రకాలుగా నిందిస్తూ ఉంటారని బీజేపీ నేతలు కూడా ఫైర్ అవుతూంటారు. ఇక సోనియా గాంధీ ఆత్మ కధలో కూడా మోడీని తనతో పెద్దగా మాట్లాడరు అని చెప్పిన వ్యాఖ్యానం ఉంది. ఇలా చూస్తే కాంగ్రెస్ అగ్ర నాయకత్వం మరీ ముఖ్యంగా గాంధీలు అంతా మోడీ పొడ గిట్టనట్లుగా ఉంటూంటే అదే పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు మాత్రం మోడీతో ఎంతో బాగా ఉండడం అయితే రాజకీయంగానూ చర్చనీయాంశం అవుతోంది. అయితే ఇందులో చెప్పుకోవడానికి ప్రత్యేకత ఏమీ లేదని ఇదంతా సీఎం పీఎం ల మధ్య ఉండే ప్రభుత్వ పరమైన లాంచనం మాత్రమే అని ఎంత చెప్పినా కూడా గతంలో వేరే పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు ప్రధానుల మధ్య ఇంత సయోధ్య లేదని కూడా గుర్తు చేస్తున్నారు. ఏది ఏమైనా మోడీ తీరు స్పెషల్ అనుకోవాల్సిందే.

భారత్ సమ్మిట్‌పై ముదురుతున్న రాజకీయ దుమారం..



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో విదేశీ ప్రతినిధుల ప్రసంగాలు రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇటలీకి చెందిన నేత జియకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సోమవారం శంషాబాద్ ఇమ్మిగ్రేషన్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. జియకోమో ఫిలిబెక్ ప్రస్తుతం భారత్‌లో ఉంటే వెంటనే దేశం నుంచి డీపోర్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన ఇప్పటికే దేశం విడిచి వెళ్లి ఉంటే తిరిగి భారత్‌లో అడుగుపెట్టకుండా నిషేధం విధించాలని కోరారు.

వేరే దేశంలో అయితే కాల్చిపారేసేవారు..

ఫిలిబెక్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన రామచందర్ రావు.. కొన్ని దేశాల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాల్చి పారేసేవారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు రాహుల్ గాంధీ, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిలిబెక్ వ్యాఖ్యలకు చప్పట్లు కొట్టారని ఆరోపించారు. ఇంతకంటే దేశద్రోహం ఏముంటుందని ప్రశ్నించారు. భారత్ సమ్మిట్ నిర్వహించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై త్వరలోనే డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. భారత్ సమ్మిట్ వేదికగా దేశ వ్యతిరేక నినాదాలు వినిపించారని ఆందోళన వ్యక్తం చేశారు.

జియకోమో ఫిలిబెక్ ఏమన్నారు?

భారత్ సమ్మిట్‌లో ప్రసంగించిన ఇటలీ నేత జియకోమో ఫిలిబెక్.. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్న ఓటు చోరీ అంశాన్ని ప్రస్తావించారు. 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' అంటూ నినాదాలు చేశారు. భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో ఓ విదేశీ నేత జోక్యం చేసుకోవడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మన దేశ రాజకీయ అంశాలపై విదేశీ ప్రతినిధులు వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా మరోవైపు ఫిలిబెక్ వ్యాఖ్యలపై ఇటలీ అధికార పార్టీ ఫోర్జా ఇటాలియా (ఖీశీతీఓ కుశ్రీఱు) పార్లమెంట్ సభ్యురాలు, జాతీయ డిప్యూటీ సెక్రటరీ డెబోరా బెర్గామిని స్పందించారు. భారతదేశ అంతర్గత రాజకీయ వివాదాల్లో యూరోపియన్ నేతలు జోక్యం చేసుకోవడం ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు.



సంపాదకీయం

మంగళవారం 17-11-2026

డీలిమిటేషన్ అడుగులు....

దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన డీలిమిటేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటికీ రాష్ట్రపతి అధికారికంగా ముగించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952, 1963, 1973 మరియు 2002 సంవత్సరాల్లో డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయివర్షాకాల సమావేశాలు ఇంకా ప్రొరోగ్ కానందున, కొత్త సమావేశాల కోసం 14 రోజుల గడువు అవసరం లేకుండా కేవలం 48 గంటల ముందుగా ఎంపీలకు సమాచారం ఇచ్చి ప్రత్యేక భేటీని నిర్వహించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నంకేతాలు ఇచ్చారు.సాధారణంగా పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుండి నాలుగు రోజుల్లోనే రాష్ట్రపతి సభను ప్రొరోగ్ చేస్తారు. కానీ, ఈసారి వర్షాకాల సమావేశాలు వాయిదా పడి 90 రోజులకు చేరువవుతున్నా సభను అధికారికంగా ముగించకపోవడంతో 2008 నాటి 87 రోజుల రికార్డు సైతం బద్దలైంది. గత ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుండి 850 వరకు పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో అది వీగిపోయింది.ఈ నేపథ్యంలో, ఈసారి పక్కా సంఖ్యాబలాన్ని కూడగట్టుకుని, ఎప్పుడైనా సరే 48 గంటల షార్ట్ నోటీసుతో సభను సమావేశపరిచి బిల్లును గట్టెక్కించాలని కేంద్రం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పలు దఫాలు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. 1952, 1955 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కొన్ని ఉమ్మడి నియోజకవర్గాలుగా ఉండేవి. వీటిలో ఒకరు సాధారణ అభ్యర్థి, మరొకరు రిజర్వుడు అభ్యర్థిగా ఉండేవారు. ఆ తరువాత ఈ విధానం మారిపోయింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను విభజించాలన్న డీ లిమిటేషన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరిగింది.ప్రస్తుతం 175 నియోజకవర్గాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వివిధ ఎన్నికల సమయంలో ఏ విధంగా పెరిగిందో తెలునుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 1955లో 245 నియోజకవర్గాలుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తర్వాత ఎన్నికలకు 300 స్థానాలకు చేంది తర్వాత మళ్లీ తగ్గిపోయింది. దీనికి కారణం జనాభా పెరుగుదల మేరకు డీ లిమిటేషన్ సిఫార్సులే.ఎంతమంది ప్రజలకు ఎంతమంది ప్రజాప్రతినిదులు ఉండాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు డీ లిమిటేషన్ అమల్లోకి వచ్చింది. దేశంలో 1952 నాటికి 494 పార్లమెంటు స్థానాలు ఉండేవి 1962లో 522 పార్లమెంటు స్థానాలు, 3,771 అసెంబ్లీ స్థానాలకు పెరిగాయి. 1972లో 543 పార్లమెంటు స్థానాలు 3,997 అసెంబ్లీ స్థానాలుండగా ఆ సంఖ్య 2002లో 543 పార్లమెంటు స్థానాలకు, 4,123 అసెంబ్లీ స్థానాలకు చేరింది. ప్రతి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య మారుతుంటుంది. 1953లో చంద్రశేఖర అయ్యర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా 1973లో జేఎల్ కపూర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంటు సభ్యులుండాలన్న ప్రతిపాదనలతో సంఖ్య పెరిగింది 2002లో నియమితులైన కులదీప్ సింగ్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన సిఫార్సులు 2008 నుంచి అమల్లోకి వచ్చాయి.మరోవైపు, కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియే 'డీలిమిటేషన్' ఇది మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడి ఉంది. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో స్థానాలు పెరిగి, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల (తెలుగు రాష్ట్రాలతో సహా) ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 2026 తర్వాత జనాభా గణన ఆధారంగా లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి సుమారు 850 వరకు పెరిగే అవకాశం ఉంది. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రకారం, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరుగుతాయి, కానీ జనాభా నియంత్రణ పాటించిన తెలుగు రాష్ట్రాలు , కేరళ, తమిళనాడు రాష్ట్రాల ప్రాతినిధ్యం (లోక్‌సభ సీట్లు) తగ్గుతుందనే భయం ఉంది. అభివృద్ధి, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను నష్టపరిచే విధంగా ఈ విభజన ఉండకూడదని పలువురు ఎంపీలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ బిల్లుపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి, ఇది దేశ రాజకీయ సమతుల్యతను మార్చే అవకాశం ఉన్నందున చాలా సున్నితమైన అంశంగా మారింది.రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన రెండు మూడొంతుల మెజారిటీని అడ్డదారిలో కూడగట్టుకునేందుకు అమిత్ షాకు సమయం ఇవ్వడానికే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేయకుండా జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఢిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రశ్నించే గొంతులంటే భయమా?



న్యూఢిల్లీ,ప్రజాస్వామ్య బలం అధికారంలో కాదు.. ఆ అధికారాన్ని ప్రశ్నించే స్వరాలను ఎంత స్వేచ్ఛగా అనుమతిస్తుందన్న దానిలో ఉంటుంది. ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుకలకు వేదికలు కల్పించడం సులభం. కానీ ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులు, మేధావులు, భిన్నాభిప్రాయాలు కలిగిన వ్యక్తులకు కూడా సమాన స్వేచ్ఛ కల్పించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఉంటుంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026 చుట్టూ తలెత్తిన విదేశీ ప్రతినిధుల వీసా వివాదం ఇప్పుడు ఈ మౌలిక ప్రశ్ననే దేశం ముందుంచింది. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానించిన విదేశీ ప్రతినిధుల్లో కొందరికి వీసాలు నిరాకరించారని, మరికొందరి అనుమతులు రద్దయ్యాయని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్, రాష్ట్ర రేవంత్ రెడ్డి ఆరోపించారు. థరూర్ ప్రకారం, 315 మంది వక్తల్లో 115 మంది భారత్‌కు రాలేకపోయారు. విదేశీయులకు వీసాలు మంజూరు చేయడం, నిరాకరించడం ఏ దేశానికైనా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే. భద్రత, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవచ్చు.కానీ ఒకసారి అనుమతులు ఇచ్చిన తర్వాత వాటిని రద్దు చేస్తే, దానికి కారణాలు వివరించాల్సిన బాధ్యత లేదా?వీసా నిర్ణయాలు సార్వభౌమాధికార అంశం అని చెప్పడం అధికార పరిధిని తెలియజేస్తుంది. కానీ నిర్ణయం న్యాయసమ్మతమైనదా,పారదర్శకమైనదా అన్న ప్రశ్నకు సమాధానం కాదు. భద్రతా రహస్యాలను వెల్లడించాల్సిన అవసరం లేకపోయినా, సాధారణ కారణాలను, చట్టపరమైన ప్రక్రియను వివరించడం ప్రజాస్వామ్య జవాబుదారీతనం. నార్వేకు చెందిన జర్నలిస్టు హెలె లింగ్ స్వెండ్సెన్‌కు భారత్ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం దక్కలేదనే వివాదం కూడా చర్చకు వచ్చింది. మే 2026లో ప్రధాని మోడీని జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారా అని ఆమె ప్రశ్నించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. ఒక జర్నలిస్టు ప్రధానమంత్రిని ప్రశ్నించడం దేశ వ్యతిరేక చర్య కాదు. ప్రభుత్వ విధానాలను విమర్శించడం దేశద్రోహం కాదు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం హక్కు మాత్రమే కాదు.. అధికారాన్ని జవాబుదారీగా ఉంచే కీలకమైన ప్రక్రియ. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సమావేశం నిర్వహించడం తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురాగల అవకాశం. కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పార్టీల పాలనలో ఉన్నా, అంతర్జాతీయ కార్యక్రమాల నిర్వహణలో సమన్వయం అవసరం. రాజకీయ విభేదాల కారణంగా రాష్ట్ర ప్రణాళికలు దెబ్బతినకూడదు. విదేశీయుల ప్రవేశంపై కేంద్రానికి అధికారం ఉన్నప్పటికీ, ముందస్తు సమాచారం, స్పష్టమైన మార్గదర్శకాలు, పరస్పర సహకారం తప్పనిసరి. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందుతోంది. అంతర్జాతీయ వేదికలపై స్వేచ్ఛ, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతోంది.అలాంటి దేశంలో విమర్శనాత్మక స్వరాల ప్రవేశంపై వివాదం తలెత్తడం దేశ ప్రతిష్ఠకు సంబంధించిన అంశం. కేంద్ర ప్రభుత్వానికి భద్రతాపరమైన కారణాలు ఉంటే వివరించాలి. వీసా అనుమతులు రద్దు చేయడానికి కారణాలు వెల్లడించాలి. ప్రక్రియలో లోపాలు ఉంటే సరిదిద్దాలి. విమర్శలను రాజకీయ ప్రత్యర్థుల ప్రచారంగా కొట్టిపారేయడం సులభం. కానీ పారదర్శకమైన సమాధానం ఇవ్వడం నిజమైన ప్రజాస్వామ్య నాయకత్వానికి నిదర్శనం.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తప్పులు చేయవచ్చు. కానీ తప్పులను ప్రశ్నించే స్వరాలను అణచివేయకూడదు. దేశ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. సార్వభౌమాధికారాన్ని కాపాడాలి. కానీ వాటి పేరుతో ప్రజాస్వామ్య స్వేచ్ఛను అనవసరంగా కుదించకూడదు. ప్రశ్నించే గొంతుకలను అనుమతించని ప్రజాస్వామ్యం.. ప్రజాస్వామ్యంగా మిగలదు. విమర్శను శత్రుత్వంగా చూడని ప్రభుత్వం, భిన్నాభిప్రాయాన్ని ప్రజాస్వామ్య సంపదగా గుర్తించే పాలన మాత్రమే దేశానికి నిజమైన బలం.

చైనాకు ట్రంప్ చెక్!.. ఏఐ దిగ్గజాలకు ప్రత్యేక హోదా.. అమెరికా కొత్త మాస్టర్‌ప్లాన్!



వాషింగ్టన్: ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ఆధిపత్యం కోసం అమెరికా, చైనా మధ్య పోటీ రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ఈ పోరులో తమ దేశానికి చెందిన టెక్నాలజీ కంపెనీలను మరింత బలోపేతం చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. ప్రముఖ ఏఐ, టెక్నాలజీ సంస్థలకు 'నేషనల్ ఛాంపియన్స్' (జాతీయ చాంపియన్లు) హోదా కల్పించాలని యోచిస్తోంది. ఈ జాబితాలో ఎన్విడియా, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఓపెన్ఏఐ, ఆంత్రోపిక్ వంటి దిగ్గజ సంస్థలు ఉండనున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యూఎస్‌జే) వెల్లడించింది. రెండు డజన్లకుపైగా సంస్థలకు ఈ ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తున్నట్లు పేర్కొంది. అమెరికా కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరించేందుకు ప్రభుత్వ సహకారం అందించడం, చైనా సంస్థలతో పోటీపడే సామర్థ్యాన్ని పెంచడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.

దిగ్గజ సంస్థలకు ప్రత్యేక గుర్తింపు!

డబ్ల్యూఎస్‌జే కథనం ప్రకారం.. అమెరికా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నేషనల్ ఛాంపియన్స్ జాబితాలో పలు ప్రముఖ సంస్థలకు చోటు దక్కే అవకాశం ఉంది. -ఎన్విడియా:ఏఐ చిప్‌ల తయారీలో ప్రపంచ అగ్రగామి సంస్థ.
-అమెజాన్: క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ మౌలిక సదుపాయాల్లో కీలక సంస్థ.
- మైక్రోసాఫ్ట్: ఏఐ సాఫ్ట్‌వేర్, క్లౌడ్ సేవల్లో అంతర్జాతీయ దిగ్గజం.
-ఓపెన్ఏఐ: చాట్‌జీపీటీ వంటి జనరేటివ్ ఏఐ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్న సంస్థ. -ఆంత్రోపిక్: క్లౌడ్ ఏఐ మోడళ్లను రూపొందిస్తున్న సంస్థ.
వీటితోపాటు మరో రెండు డజన్లకుపైగా కంపెనీలకు ఈ గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అయితే పూర్తి జాబితా, అర్హతలు, ప్రత్యేక హోదా కింద అందించే ప్రయోజనాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

అంతర్జాతీయ మార్కెట్లలో అమెరికా పట్టు!

ఏఐ రంగంలో కేవలం అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడం మాత్రమే సరిపోదని అమెరికా భావిస్తోంది. ఇతర దేశాలు కూడా తమ ఏఐ చిప్‌లు, క్లౌడ్ సేవలు, సాఫ్ట్‌వేర్, ఏఐ మోడళ్లను వినియోగించేలా చేయడం ద్వారా దీర్ఘకాలిక ఆధిపత్యాన్ని సాధించాలని చూస్తోంది.ఈ నేపథ్యంలో అమెరికా కంపెనీలు విదేశీ మార్కెట్లలోకి విస్తరించేందుకు ప్రభుత్వ సహకారం అందించాలన్నది తాజా ప్రతిపాదనలో కీలక అంశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చైనా కంపెనీలు తక్కువ ధరలకు ఏఐ సేవలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి. ఈ పోటీని ఎదుర్కొనేందుకు అమెరికా తన టెక్నాలజీ కంపెనీలకు అండగా నిలవాలని భావిస్తోంది.

ఇప్పటికే అమల్లోకి వచ్చిన ఏఐ ఎగుమతుల ప్రణాళిక!

అమెరికా తాజా ప్రతిపాదనకు గతంలోనే పునాదులు పడ్డాయి. 2025 జులై 23న ట్రంప్ ప్రభుత్వం 'అమెరికన్ ఏఐ టెక్నాలజీ స్టాక్ ఎగుమతుల ప్రోత్సాహం' పేరుతో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14320ను జారీ చేసింది. అమెరికా రూపొందించిన ఏఐ సాంకేతికతను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో భాగంగా చిప్‌లు, సర్వర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ సేవలు, ఏఐ మోడళ్లు, సాఫ్ట్‌వేర్, సైబర్ భద్రత వంటి అన్ని అంశాలను కలిపి సమగ్ర సాంకేతిక ప్యాకేజీల రూపంలో ఇతర దేశాలకు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం రుణాలు, రుణ హామీలు, పెట్టుబడులు, సాంకేతిక సహకారం వంటి ప్రభుత్వ వనరులను ఉపయోగించుకునే అవకాశం కల్పించింది. 2026లోనూ ఈ కార్యక్రమాన్ని విస్తరించే చర్యలు చేపట్టింది. ఫిబ్రవరిలో వైట్‌హౌస్ వెల్లడించిన నేషనల్ ఛాంపియన్స్ ఇనిషియేటివ్ కూడా భాగస్వామ్య దేశాలకు అమెరికా ఏఐ సాంకేతిక వ్యవస్థను విస్తరించే లక్ష్యంతో ముందుకు వచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా వాణిజ్య శాఖ పూర్తి స్థాయి ఏఐ ఎగుమతి ప్యాకేజీలకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రకటించింది.అంటే తాజాగా వార్తల్లోకి వచ్చిన ప్రతిపాదనను పూర్తిగా కొత్త విధానంగా కాకుండా.. ఇప్పటికే కొనసాగుతున్న అమెరికా ఏఐ ఎగుమతుల వ్యూహానికి మరింత విస్తృత రూపంగా చూడవచ్చు.

చైనాతో టెక్నాలజీ యుద్ధం!

ప్రపంచ ఏఐ రంగంలో అమెరికాకు ప్రస్తుతం బలమైన సాంకేతిక సంస్థలు, అత్యాధునిక చిప్ తయారీ పరిజ్ఞానం, భారీ డేటా సెంటర్లు, పరిశోధనా సామర్థ్యం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. మరోవైపు చైనా కూడా డీప్‌సీక్, హువావే వంటి సంస్థల ద్వారా వేగంగా ముందుకు సాగుతోంది. తక్కువ వ్యయంతో ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడం, ఓపెన్‌సోర్స్ సాంకేతికతను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో తన ఉనికిని పెంచుకుంటోంది.ఈ పరిస్థితుల్లో అమెరికా కంపెనీలకు ప్రభుత్వ మద్దతు అందించడం ద్వారా ఇతర దేశాలు చైనా టెక్నాలజీ వైపు మళ్లకుండా చూడాలన్నది ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ముఖ్యంగా చిప్‌ల నుంచి ఏఐ అప్లికేషన్ల వరకు మొత్తం సాంకేతిక వ్యవస్థను ఒకే ప్యాకేజీగా అందించడం ద్వారా అమెరికా టెక్నాలజీపై ఇతర దేశాల ఆధారపడటాన్ని పెంచుకోవాలని చూస్తోంది.

కంపెనీలకు ఏమి లాభం?

నేషనల్ ఛాంపియన్స్ హోదా ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎంపికైన సంస్థలకు అంతర్జాతీయ విస్తరణలో పలు ప్రయోజనాలు లభించే అవకాశం ఉంది.
- విదేశీ ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ప్రభుత్వ సహకారం.
- ఇతర దేశాల్లో ఏఐ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రోత్సాహం.
- అమెరికా ప్రభుత్వ ఆర్థిక, దౌత్యపరమైన వనరుల వినియోగానికి అవకాశం.
- అమెరికా చిప్‌లు, క్లౌడ్ సేవలు, ఏఐ మోడళ్ల ఎగుమతులకు ప్రాధాన్యం.
- అంతర్జాతీయ ఏఐ ప్రమాణాలు, సాంకేతిక విధానాల రూపకల్పనలో అమెరికా ప్రభావం పెంపు.
అయితే తాజా నివేదికలో ఈ ప్రయోజనాలన్నీ నేషనల్ ఛాంపియన్స్ హోదా కింద ఖరారయ్యాయని చెప్పలేదు. వాటి అమలు విధానం, కంపెనీల ఎంపిక ప్రమాణాలు, ప్రభుత్వ సహకారం ఎంతవరకు ఉంటాయన్న అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది!

రెండు డజన్లకుపైగా సంస్థలకు నేషనల్ ఛాంపియన్స్ హోదా ఇవ్వాలన్న వార్తను వాల్‌స్ట్రీట్ జర్నల్ తనకు సమాచారం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ ప్రచురించింది. అయితే ఈ సమాచారాన్ని తక్షణమే స్వతంత్రంగా ధ్రువీకరించలేకపోయినట్లు రాయిటర్స్ స్పష్టం చేసింది. అమెరికా ప్రభుత్వం నుంచి కూడా ఈ నిర్దిష్ట ప్రతిపాదనపై అధికారిక ప్రకటన వెలువడలేదు.అమెరికా, చైనా మధ్య ఏఐ ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం సాంకేతిక అభివృద్ధికే పరిమితం కావడం లేదు. అంతర్జాతీయ మార్కెట్లలో ఎవరి సాంకేతికతకు ఎక్కువ ఆదరణ లభిస్తుందన్న అంశం కూడా కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో అమెరికా ఏఐ కంపెనీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలన్న ట్రంప్ ప్రభుత్వ ఆలోచన అమల్లోకి వస్తే ప్రపంచ టెక్నాలజీ మార్కెట్‌లో కొత్త పోటీకి తెరలేవడం ఖాయం.

కలహాల కూటమి...

అనంతపురం,స్థానిక ఎన్నికల పోలింగ్ ముగిసిపోయి.. ఫలితాలు కూడా వచ్చేసిన విషయం తెలిసిందే. ఇక, మరో వారంలో కొత్త మేయర్లు, కొత్త కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం కూడా చేయనున్నారు. అలానే మునిసిపాలిటీలలో చైర్మన్‌లు, కౌన్సిలర్లు కూడా.. బాధ్యతలు చేపట్టేందుకు రెడీ అయ్యారు. ఇదిలావుంటే.. ఎన్నికల సమయంలో కొందరు టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. వీరి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తమ పార్టీ నాయకులు అనుసరించిన విధానాల వల్లే తాము ఓడామంటూ.. తమ తమ పార్టీలకు చెందిన సీనియర్ నాయకు లనే ఓడిపోయిన వారు విమర్శిస్తున్నారు.. దీంతో టీడీపీలో నాయకులకు-నాయకులకు మధ్య అంతర్యుద్ధం పెరుగుతోంది. తాజాగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై స్థానిక టీడీపీ నాయకులు, ముఖ్యంగా స్థానికంలో ఓడిపోయిన వారు తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన యార్లగడ్డ.. ఇప్పటికీ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటీవల గన్నవరంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ భారీగా పుంజుకుంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వర్గం ఇక్కడ పుంజుకుంది. ఈ పరిణామాలపైనే ఓడిపోయిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

50 రకాల క్యాన్సర్‌లను ముందుగానే గుర్తించే కొత్త రకమైన పరీక్ష..

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు ఒకే రక్త నమూనాతో 50కి పైగా రకాల క్యాన్సర్లను గుర్తించగలుగుతామని చెబుతున్న గల్లెరి పరీక్షపై ఆసక్తి పెరుగుతోంది. ఈ పరీక్షను అభివృద్ధి చేసిన సంస్థ వాదనల ప్రకారం.. లక్షణాలు కనిపించకముందే క్యాన్సర్‌కు సంబంధించిన సంకేతాలను గుర్తించవచ్చు. అయితే పరిశోధనల్లో ఈ పరీక్షకు కొన్ని పరిమితులు ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించడంలో ఇది అంత సమర్థవంతంగా లేదని, క్యాన్సర్ మరణాల ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఇప్పటివరకు నిరూపితం కాలేదని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ సలహా మండలి గత సెప్టెంబర్ 23న ఈ పరీక్షకు అనుమతి ఇవ్వాలని సిఫారసు చేసింది. అయితే ఇది తుది అనుమతి కాదు. పరీక్షకు సంబంధించిన వివరాల్లో ప్రారంభ దశ క్యాన్సర్ గుర్తింపు అనే పదాన్ని తొలగించాలని కూడా మండలి సభ్యులు సూచించారు.

గల్లెరి పరీక్ష అంటే ఏమిటి..?:

గల్లెరి పరీక్ష రక్తంలోని క్యాన్సర్ కణాల నుంచి విడుదలయ్యే డీఎన్ఏ ముక్కలను పరిశీలిస్తుంది. వాటిపై ఉండే ప్రత్యేకమైన మిథైలేషన్ గుర్తులను గుర్తించి, యంత్ర అభ్యాస పద్ధతుల ద్వారా క్యాన్సర్ సంకేతాలు ఉన్నాయా లేదా అని ఫలితం ఇస్తుంది. 50కి పైగా క్యాన్సర్లను గుర్తించే అవకాశం, క్యాన్సర్ ఏ అవయవం నుంచి మొదలై ఉంటుందో అంచనా వేయగలగడం దీని ప్రత్యేకతలు. ఒక అధ్యయనంలో పరీక్ష చేయించుకున్న 32 వేల మందిలో 173 మందికి క్యాన్సర్ నిర్ధారణ కాగా, వారిలో 91 శాతం మందికి క్యాన్సర్ రకాన్ని ఈ పరీక్ష సరిగ్గా అంచనా వేసింది. తప్పుడు పాజిటివ్ ఫలితాలు కూడా సుమారు 0.5 శాతమేనని పరిశోధకులు తెలిపారు. అయితే మూడు సంవత్సరాల పాటు పరీక్షించినప్పుడు అన్ని దశల్లోని క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం 31 శాతం కంటే తక్కువగా ఉంది. అంటే దాదాపు 69 శాతం కేసులను గుర్తించలేకపోయింది. ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం కేవలం 21 శాతమే. అంటే దాదాపు 80 శాతం కేసులు తప్పిపోయాయి.

సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు..: ఈ పరీక్ష వల్ల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి మరణాల ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఆశించినప్పటికీ, ఇప్పటివరకు అలాంటి ప్రయోజనం నిరూపితం కాలేదు. మూడు సంవత్సరాల్లో ముదిరిన దశ క్యాన్సర్ల సంఖ్యను తగ్గించాలన్న పరిశోధన లక్ష్యాన్ని కూడా ఈ పరీక్ష చేరుకోలేకపోయింది. అమెరికా సలహా మండలి పరీక్ష సురక్షితమని ఏకగ్రీవంగా సిఫారసు చేసినప్పటికీ, దాని ప్రభావంపై మాత్రం సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పాజిటివ్ ఫలితం వస్తే మరిన్ని పరీక్షలు, కొన్నిసార్లు బయాప్సీ చేయాల్సి వస్తుంది. ఒక అధ్యయనంలో 0.6 శాతం మందికి ఇన్వేసివ్ పరీక్షలు అవసరమయ్యాయి. పరీక్ష వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలపై ఇంకా స్పష్టత అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. వైద్యులతో చర్చించాలి..: ఈ పరీక్ష చేయించుకోవాలా వద్దా అనే విషయాన్ని వైద్యుడితో చర్చించిన తర్వాతే నిర్ణయించుకోవాలి. అమెరికాలో ప్రస్తుతం దీని ధర 949 డాలర్లు కాగా, ప్రభుత్వ ఆరోగ్య బీమా లేదా ఇతర బీమా సంస్థలు ఖర్చును భరిస్తాయనే హామీ లేదు. తప్పుడు నెగెటివ్ ఫలితం వచ్చిందని క్యాన్సర్ లేదని పూర్తిగా నమ్మకూడదు. ముఖ్యంగా పెద్దపేగు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ఊపిరితిత్తుల క్యాన్సర్ల కోసం ప్రస్తుతం సిఫారసు చేస్తున్న పరీక్షలను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి ప్రారంభ దశలో క్యాన్సర్‌ను గుర్తించడమే కాకుండా, క్యాన్సర్ వల్ల మరణించే ప్రమాదాన్ని తగ్గిస్తాయని నిరూపితమైంది. కొత్త పరీక్షలపై ఆశలు పెట్టుకున్నప్పటికీ, నిరూపితమైన క్యాన్సర్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడమే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రకృతి సేద్యం... సూపర్....

ఏలూరు, ప్రకృతి వైపరీత్యాల ముందు మనిషి నిస్సహాయుడు అంటారు. కానీ, ప్రకృతిని నమ్ముకుని వ్యవసాయం చేసిన రైతుల పంటలు మాత్రం తుఫానుల ధాటికి సైతం తట్టుకుని నిలబడ్డాయి. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాను వణికించిన వరుస తుఫానుల అనంతరం పక్కపక్కనే ఉన్న పొలాల్లో కనిపించిన దృశ్యాలు ఇప్పుడు వ్యవసాయ రంగంలో ఆసక్తికర చర్చకు దారితీశాయి.అక్టోబర్ 27, 28 తేదీల్లో విరుచుకుపడిన ఆర్నబ్ తుఫాను, ఆ వెంటనే నవంబర్ 2, 3 తేదీల్లో ముంచెత్తిన మురసు తుఫాను పశ్చిమగోదావరి జిల్లా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులు, భారీ వర్షాల కారణ

హైదరాబాద్‌లో 3 కారిడార్లలో పీఆర్‌టీఎస్.

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడం కోసం రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. మూడు ప్రధాన మార్గాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేవడానికి ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లోగా పనులు ప్రారంభించి.. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో కేపీహెచ్‌బీ నుంచి బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ (ప్రతిపాదిత) వరకు ఏర్పాటు చేయబోయే మార్గం కీలకం కానుంది. హైదరాబాద్ నగరంలోని ఐటీ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) మెట్రో స్టేషన్ నుంచి త్వరలో రానున్న బయోడైవర్సిటీ మెట్రోస్టేషన్ వరకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్టీఎస్) ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్ స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు పీఆర్టీఎస్‌ను ఏర్పాటు చేయనున్నారు.హైదరాబాద్ నగరంలోని ఐటీ సంస్థలు ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు ఎక్కువగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, చందానగర్ ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తు?న్నారు. మియాపూర్ నుంచి రాయదుర్గం వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే మెట్రోలో వెళ్లాలంటే చుట్టూ తిరుగుతూ అమీర్‌పేట మీదుగా 17 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. అంతే కాకుండా అమీర్‌పేటలో రైలు మారాలి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో.. ఎక్కువ దూరం ప్రయాణించడం, రైలు మారాల్సి రావడం ఐటీ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉంది. దీంతో చాలా మంది ఇప్పటికీ కార్లు, బైకుల, ట్యాక్సీల మీదే ఆఫీసులకు వెళ్తున్నారు. దీంతో గచ్చిబౌలి నుంచి కేపీహెచ్‌బీ వెళ్లే రూట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.పీఆర్టీఎస్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో డిసెంబర్ నాటికి టెండర్లు పూర్తి చేసి.. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్‌ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఐటీ కారిడార్‌లో పీఆర్టీఎస్ సాధ్యాసాధ్యాలపై లీ అసోసియేట్స్ సమర్పించిన రిపోర్టు ఇప్పటికే సిద్ధంగా ఉంది కాబట్టి వెంటనే పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్లలో మొత్తం 34.46 కిలోమీటర్ల మేర పీఆర్టీఎస్‌ను ప్రతిపాదించారు. అయితే తక్షణ ప్రాధాన్యంగా కేపీహెచ్‌బీ నుంచి రాయదుర్గం వరకు 7.62 కి.మీ. మార్గా?న్ని మొదటి జోన్‌లో భాగంగా అందుబాటులోకి తేనున్నారు. తర్వాత దీన్ని మిగతా ఐటీ కారిడార్ మొత్తానికి విస్తరించనున్నారు.ఐటీ కారిడార్‌తోపాటు హైదరాబాద్ కోర్ సిటీలోనూ మరో రెండు మార్గాల్లో పీఆర్టీఎస్ ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. ఎల్బీ స్టేడియం నుంచి రాణిగంజ్ బస్టాండ్ వరకు ఒక లైన్ కాగా.. అసెంబ్లీ మెట్రో నుంచి బేగంపేటకు మరో లైన్ ఉండనుంది. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్టాండ్ వరకు మొదటి లైన్ ఉంటుంది. రెండో లైన్లో రవీంద్ర భారతి, సచివాలయం, ఐమ్యాక్స్ ప్రాంతాలు కూడా కవర్ అవుతాయి. అయితే వీటిలో అసెంబ్లీ నుంచి బేగంపేట పీఆర్టీసీ లైన్ ఏర్పాటు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.మెట్రోకు అనుసంధానంగా పాడ్ కార్లు.. కూకట్‌పల్లిలో ఖఖీూ భారీ డిపో.. 104 ఎకరాల్లో ఏర్పాటు..!గచ్చిబౌలి ఐకియా ప్రాంతంతోపాటు నెక్లెస్ రోడ్‌లో మల్టీ లెవల్ పార్కింగ్‌లు ఏర్పాటు చేసి పీఆర్టీఎస్ డిపోలు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.2027 చివరి నాటికి పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి వస్తే.. ఐటీ కారిడార్లో ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉంది. ఐటీ ఉద్యోగులు 15 నిమిషాల్లోపే కేపీహెచ్‌బీ నుంచి మైండ్ స్పేస్‌కు చేరుకునే అవకాశం ఉంటుంది. తొలి దశ పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి వస్తే.. 2030 నాటికి రోజుకు 75 వేల మందికిపైగా ప్రయాణికులు ఈ సేవలను వాడుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

క్యూబాలో ఆకలి కేకలు ...

హవానా: కరీబియన్ సముద్రంలోని ద్వీప సమూహ దేశం క్యూబాలో అధికారంలో ఉన్న సామ్యవాద వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా దేశ ప్రజలకు ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, రాయితీతో కూడిన ఆహారం, అత్యధికులకు ప్రభుత్వరంగ ఉపాధి అందిస్తూ వచ్చింది. బియ్యం, బీన్స్, పాలపొడి, చికెన్, వంటనూనె, గుడ్ల వంటి ఆహార దిగుమతులపై గతంలో ఏటా 2 బిలియన్ డాలర్లకు (రూ.18,855 కోట్లు) పైగా ఖర్చు చేసేది. దాదాపుగా 99 శాతం అక్షరాస్యత ఉన్న ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఓ మోస్తరుగా ఉన్నా, కనీస అవసరాలకు ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు అదంతా గత చరిత్ర. సుమారు కోటీ 10 లక్షల జనాభా గల నేటి క్యూబాను సుదీర్ఘకాలంగా ఆర్థికసంక్షోభం పీడిస్తోంది. అమెరికా ఇంధన ఆంక్షలు, పెరిగిన ద్రవ్యోల్బణం, తరుగుతున్న ప్రభుత్వ వనరులు క్యూబన్ల జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ఇంధన ఆంక్షలు ఈ ద్వీప జనజీవనాన్ని దారుణంగా దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పర్యాటకరంగం తీవ్రంగా క్షీణించింది. రాజధాని నగరం హవానాలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రం వద్ద వందలాదిగా జనం బారులు తీరుతున్నారు. ఉదయాన్నే ఏడింటికి తలుపులు తెరిచే ఈ కేంద్రంలో పంపిణీ చేసే ఆహారం కోసం కొంతమంది ప్లాస్టిక్ బొచ్చెలతో రాత్రే అక్కడికి చేరుకొని రోడ్డు మీద పడుకొంటున్నారు. “మేము చాలా గడ్డు రోజులు గడుపుతున్నాం” అని ఈ కేంద్రానికి వచ్చిన రిటైర్డ్ సెక్యూరిటీ గార్డు ఫెర్నాండో ఫెర్నాండెజ్ (71) తెలిపారు. “వీరు పంపిణీ చేసే ఆహారంతో నా బిడ్డలకు కనీసం ఒక్కపూటైనా కడుపు నిండుతుంది” అని అయిదుగురు పిల్లల తల్లి మర్లీస్ పాన్స్ (34) చెప్పారు. క్యూబాలో అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న ఇటువంటి సామాజిక వంటశాలలే అభ్రద్రతా భావంతో ఉన్న స్థానికులకు జీవనాధారంగా మారాయి. పలు ధార్మిక సంఘాలు, అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్య సమితి ఈ కేంద్రాల ద్వారా ప్రజల ఆకలిని తీరుస్తున్నాయి. ఈ కిచెన్లలో పెద్ద సైజు కడాయిలు పెట్టి అన్నం, గుడ్లు, పాస్తా.. అప్పుడప్పుడు కొద్దిపాటిగా చికెన్ వండుతున్నారు. బాటిళ్లలో చాక్లెట్ పాలను నింపుతున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి చంద్రబాబు, లోకేష్ కారణం

అమరావతి : చిత్తూరులోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి చంద్రబాబు, నారా లోకేష్ కారణమని వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులకు ఉరితాడు దిక్కవుతుందని, ఈ దారుణమైన పరిస్థితికి ముమ్మాటికీ మీరే బాధ్యులంటూ ట్విటర్‌లో విమర్శించారు. ఇదే కాలేజీలో గతంలో కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ విద్యార్థులు రోడ్డెక్కి తమ ఆవేదనను, ఆగ్రహాన్ని వెళ్ల గక్కినా టాపిక్ డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ఇంత దుర్మార్గమైన పాలన గతంలో ఎప్పుడూ చూడలేదని వెల్లడించారు. పేదవాళ్లకు గొప్ప చదువులే లక్ష్యంగా అమ్మ ఒడి నుంచి విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో దేశంలో ఎక్కడాలేని విధంగా వైసీపీ ప్రారంభించి అమలు చేస్తే, మీరు అధికారంలోకి వచ్చిన తొలి క్షణం నుంచే పేదలను ఉన్నత చదువులకు దూరం చేసే కుట్ర పన్నిందని తెలిపారు.

త్యాగానికి ప్రతిరూపం...



న్యూఢిల్లీ,భారత రాజకీయ చరిత్రలో కొన్ని జీవితాలు కేవలం అధికార పదవులు, రాజకీయ విజయాలకే పరిమితం కావు. వాటి వెనుక ఎన్నో వ్యక్తిగత అనుబంధాలు, కుటుంబ త్యాగాలు, కన్నీళ్లు, విషాదాలు, సిద్ధాంత నిబద్ధత, దేశం పట్ల అంకితభావం దాగిఉంటాయి. ప్రేమతో ప్రారంభమైన ఒక జీవితం.. అనుకోని విషాదాలను ఎదుర్కొంటూ.. రాజకీయ ఒడిదుడుకులను అధిగమిస్తూ.. దేశ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సాగిన అసాధారణ ప్రస్థానం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీది. ఆమె రచించిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని చదివినప్పుడు ఒక నాయకురాలి వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా, గత ఆరు దశాబ్దాల భారత రాజకీయ, సామాజిక పరిణామాలను కూడా దగ్గరగా చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ పుస్తకం సోనియా గాంధీ త్యాగానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. ఇది కేవలం ఒక ఆత్మకథ కాదు. ప్రేమ, కుటుంబ అనుబంధాలు, త్యాగం, రాజకీయ పోరాటం, ప్రజాస్వామ్య విలువలు మేళవించిన ఒక జీవిత గాథ. ప్రస్తుత తరానికే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా భారత రాజకీయ చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే విలువైన చారిత్రక గ్రంథం.ఇటలీలోని ఒక చిన్న పట్టణంలో సాధారణ కుటుంబంలో జన్మించిన సోనియా రాజీవ్ గాంధీని వివాహమాడి భారతదేశానికి కోడలిగా అడుగుపెట్టిన్ తర్వాత ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, జీవన విధానం కొత్తగా ఉన్నా వాటినీ అర్థం చేసుకుంటూ భారతీయ సమాజంలో మమేకమయినట్టు ఆమె అనుభవాలు చెబుతున్నాయి. ఈ పుస్తకంలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో అనుబంధాన్ని సోనియా ఆత్మీయంగా వివరించారు. ఇందిరా గాంధీని కేవలం ప్రధానమంత్రిగా కాకుండా, ధైర్యం, క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ కలిగిన ఉక్కు మహిళగా సోనియా వర్ణించారు. రాజీవ్ గాంధీలోని సౌమ్యత, మానవతా దృక్పథం, లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంపై ఉన్న నిబద్ధత తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆమె పుస్తకంలో తెలిపారు. 1980లో సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించడం, 1984 అక్టోబర్ 31న ఇందిరా గాంధీ హత్య, అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టడం, చివరకు 1991 మే 21న రాజీవ్ గాంధీ హత్యకు గురికావడం వంటి విషాద ఘట్టాలను ఆమె మాటల్లో చదువుతుంటే మనసు కలచివేస్తుంది.ఒకే కుటుంబం వరుసగా ఇన్ని విషాదాలను ఎదుర్కొన్నప్పటికీ ప్రజాజీవితంలో బాధ్యతలను నిర్వర్తించడం అసాధారణమైన విషయం. ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ క్రియాశీలక రాజకీయాల్లోకి రావడంపై సోనియా గాంధీ ఆసక్తి కనబర్చలేదు. రాజకీయాలకు దూరంగా ఉండాలని కోరుకున్న సోనియా గాంధీ భయపడినట్టే 1991లో దురదృష్టవశాత్తు రాజీవ్ మరణం తరువాత ఆమె తొలుత పార్టీ నాయకత్వాన్ని స్వీకరించడానికి నిరాకరించారు. ప్రజాభీష్టం మేరకు 1997లో సోనియా గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చి 1998లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ అంతర్గత విభేదాలు, నాయకత్వ సంక్షోభం, ఎన్నికల పరాజయాలతో సతమతమవుతున్న పార్టీ తీరును ఆమె కళ్లకు కట్టినట్టు పుస్తకంలో చెప్పారు. క్లిష్ట సమయంలో బాధ్యతలు స్వీకరించడం ఆమె రాజకీయ నాయకత్వానికి తొలి పరీక్షగా ఆమె ఎంతో విశ్వాసంతో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపించారు.దేశానికి గాంధీ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తించి తన కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీలను ప్రజాసేవ కోసం ప్రోత్సాహించిన తీరు ఈ పుస్తకంలో ఆసక్తికరంగా కనిపిస్తుంది.ప్రతిపక్షాలతోపాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు కొందరు సోనియా గాంధీ విదేశీ మూలాలను ప్రశ్నించినప్పుడు ఆమె కలత చెందిన తీరును పుస్తకంలో ఎంతో భావోద్వేగంగా వివరించారు. ఏ చిన్న పదవి, హోదా వచ్చినా వదులుకోవడాడికి ఇష్టపడిన ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో 2004లో యుపిఎ కూటమి విజయం సాధించిన తరువాత దేశంలో అత్యున్నత పదవైన ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చిన్నప్పటికీ సోనియా గాంధీ ఆ పదవిని తృణపాయంగా త్యజించి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అవకాశం కల్పించిన తీరుపై పుస్తకంలో ఆమె వివరించిన తీరు ఆదర్శప్రాయం.ప్రజా సంక్షేమంకోసం నిత్యం పరితపించే సోనియా గాంధీ 2004 -2014 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో యుపిఎ చైర్ పర్సన్‌గా పోషించిన క్రియాశీలక పాత్రను ఈ పుస్తకంలో విశ్లేషించవచ్చు. సమాచార హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, విద్యా హక్కు వంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టడంలో ఆమె చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుంది. భిన్నమైన రాజకీయ నేపథ్యం ఉన్న వామపక్షాలు, మమతా బెనర్జీ, లాలూ ప్రసాద్ యాదవ్, మాయావతి వంటి వారిని ఎలా సమన్వయం చేశారో ఈ పుస్తకంలో చదివితే ఆమె రాజకీయ చతురత అర్థమవుతుంది. సోనియా గాంధీ పలు వివాదాస్పద అంశాలను కూడా ఈ పుస్తకంలో చర్చించారు. 1975 ఎమర్జెన్సీ ఎపిసోడ్‌లో కొన్నింటిపై ఇందిరా గాంధీ విచారం వ్యక్తం చేయడాన్ని గుర్తు చేసుకున్నారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలో సోనియా గాంధీ ఎంత కలత చెందారో ఈ పుస్తకంలో వివరించారు. ప్రజాస్వామ్యానికి తిలోదకాలిస్తున్న ప్రస్తుత బిజెపి పాలనపై, ఆర్ఎస్ఎస్ విష రాజకీయాలపై ఈ పుస్తకంలో ఆమె తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ గత పన్నెండేళ్లలో ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ విలువలు, సామాజిక ఐక్యతకు ఎదురవుతున్న సవాళ్లను ప్రస్తావించారు.భారతదేశం ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతికి పరిమితం కాదని, భిన్నత్వంలో ఏకత్వం, లౌకికవాదం, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మన రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక విలువలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆమె ఈ పుస్తకంలో స్పష్టం చేశారు. ఈ పుస్తకంలో నాకు నచ్చిన ముఖ్యమైన అంశం సోనియా గాంధీ తన జీవితాన్ని కేవలం రాజకీయ విజయాల కోణంలోనే కాకుండా ప్రేమ, కుటుంబం, బాధ్యత, త్యాగం, విమర్శలు, ఆత్మపరిశీలన వంటి కోణాల్లో ఆవిష్కరించడం. 'బిలాంగింగ్ : ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ప్రస్తుత తరానికి మాత్రమే కాదు, భవిష్యత్ తరాలకు కూడా ఒక మంచి చారిత్రక సూచిక గ్రంథం. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ పాలనా కాలాల వరకు భారతదేశంలో చోటుచేసుకున్న రాజకీయ, సామాజిక మార్పులను అర్థం చేసుకోవడానికి ఈపుస్తకం దిక్సూచిగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా నేటి యువత రాజకీయ నాయకుల జీవితాలను కేవలం ఎన్నికల విజయాలు, పరాజయాల ఆధారంగా కాకుండా, వారి అనుభవాలు, నిర్ణయాలు, సిద్ధాంతాలు, దేశానికి చేసిన సేవల ఆధారంగా కూడా పరిశీలించాలి.భారతదేశానికి కోడలిగా వచ్చి కాలక్రమంలో భారతీయతను తన అస్తిత్వంగా స్వీకరించి, భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడం అసాధారణమైన ప్రస్థానం. వ్యక్తిగత జీవితంలో ఎన్నో విషాదాలను ఎదుర్కొన్నా కుంగిపోకుండా ప్రజా జీవితంలో కొనసాగుతూ 22 ఏళ్లు పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించడం, అత్యున్నత అధికార పదవిని త్యజించి బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణ కోసం నిలబడటం సోనియా గాంధీ జీవితం నుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠాలు. 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ద్వారా ఆమె తన జీవితంలోని మధుర జ్ఞాపకాలతోపాటు చేదు అనుభవాలను, రాజకీయ నిర్ణయాల వెనుక ఉన్న ఆలోచనలను, దేశ చరిత్రలోని కీలక ఘట్టాలను భవిష్యత్ తరాల ముందు ఉంచారు. చరిత్రను తెలుసుకోవాలంటే కేవలం సంఘటనలను చదివితే సరిపోదు.. ఆ సంఘటనల వెనుక ఉన్న వ్యక్తుల అనుభవాలు, ఆలోచనలు, నిర్ణయాలను కూడా అర్థం చేసుకోవాలి. ఆ కోణంలో ఈ పుస్తకం ఒక మంచి చారిత్రక సూచిక గ్రంథం. నేటి యువత తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాల్లో ఇది ఒకటి. ఒక నాయకురాలి జీవితాన్ని తెలుసుకోవడానికే కాదు.. భారత ప్రజాస్వామ్య ప్రయాణాన్ని, దాని విలువలను అర్థం చేసుకోవడానికి కూడా ఈ పుస్తకం ఒక విలువైన మార్గదర్శి.

అమరావతిలో మెగా రైల్వేస్టేషన్

అమరావతి, రాజధాని అమరావతి రైల్వే కనెక్టివిటీ ప్రాజెక్టుకి కదలిక వచ్చింది. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో రాజధానిని అనుసంధానించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం కోర్ క్యాపిటల్ ప్రాంతంలో రైల్వే లైన్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అమరావతి రైల్వే ప్రాజెక్టు ఇన్నాళ్లు ప్రతిపాదనలకే పరిమితమైంది. అయితే ఇటీవల రైల్వేశాఖతో జరిగిన సంప్రదింపులతో అమరావతి రైలు మార్గంపై తుది నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. కొద్దిపాటి మార్పులతో రైల్వే మార్గాన్ని ఖరారు చేశారని అంటున్నారు. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతంలోని తాడికొండకు సమీపంలో కోర్ క్యాపిటల్ ప్రాంతంలో అమరావతి రైల్వేస్టేషన్ నిర్మించాలని నిర్ణయించారు. గతంలో రాజధాని కోసం 56.53 కి.మీ. మేర కొత్త రైల్వే లైను నిర్మించాలని భావించారు. అయితే తాజాగా చేసిన మార్పులతో 58.1 కి.మీ మేర రైల్వే మార్గం నిర్మాణానికి నిర్ణయించినట్లు చెబుతున్నారు. తాడికొండకు 5 కిలోమీటర్ల దూరంలో కోర్ క్యాపిటల్ ప్రాంతంలో నిర్మించనున్న రైల్వేస్టేషన్ పై కీలక అప్డేట్ వచ్చింది. విమానాశ్రయ టెర్మినల్ తరహాలో అత్యంత ఆధునిక సదుపాయాలతో భారీ రైల్వేస్టేషన్ నిర్మించనున్నారని చెబుతున్నారు. ఇందులో సుమారు 24 ప్లాట్‌ఫారాలు, నాలుగు టెర్మినళ్లు ఉంటాయని చెబుతున్నారు. అంతేకాకుండా రోజుకు 3 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ఈ మెగా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదిస్తున్నారు. ఈ ప్రతిపాదనకు తుది ఆమోదం లభిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో అత్యధిక ప్లాట్‌ఫారాలు ఉన్న విజయవాడ, విశాఖపట్నం స్టేషన్లను దాటి అమరావతి ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా నిలవనుందని చెబుతున్నారు. రాజధాని ప్రాంతాన్ని ప్రధాన రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించేందుకు ఎర్రుపాలెం ? అమరావతి ? నంబూరు మధ్య 57 కిలోమీటర్ల సింగిల్ బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌ను నిర్మిస్తున్నారు. 2024 అక్టోబర్ 24న కేంద్ర క్యాబినెట్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడు దీని ప్రారంభ అంచనా వ్యయాన్ని ?2,245 కోట్లుగా పేర్కొన్నారు. ఆ తర్వాత 2025 ఆగస్టులో లోక్‌సభలో ఇచ్చిన అధికారిక సమాధానంలో ఈ ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయాన్ని ?2,047 కోట్లుగా రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ 57 కిలోమీటర్ల మార్గంలో అమరావతి సహా మొత్తం తొమ్మిది కొత్త రైల్వే స్టేషన్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రైల్వే మార్గంలో కృష్ణా నదిపై నిర్మించబోయే భారీ వంతెన అత్యంత కీలకమైనది. గతంలో ఈ బ్రిడ్జి పొడవు 3.2 కిలోమీటర్లుగా ప్రచారంలో ఉన్నప్పటికీ, తాజా నివేదికల ప్రకారం కృష్ణా నదిపై సుమారు 3.38 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెనను నిర్మించనున్నారు. కేవలం ఈ వంతెన, దాని అప్రోచ్ పనుల కోసమే రూ.565.83 కోట్ల అంచనా వ్యయాన్ని కేటాయించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రైల్వే కనెక్టివిటీ



మరింత బలోపేతం అవుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన మెట్రో నగరాల నుంచి అమరావతికి నేరుగా రైల్వే కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ప్రయాణ సమయం, ఖర్చు ఆదా అవ్వడమే కాకుండా, అమరావతి పరిసర ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుని స్థానికులకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. భవిష్యత్తులో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమరావతి ఒక ప్రధాన రైల్వే హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.ప్రస్తుతం ఈ రైల్వే లైన్ ప్రాజెక్టు టెండర్ల దశలో ఉంది. 57 కిలోమీటర్ల మార్గాన్ని నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోంది. 2026 అక్టోబర్ నాటికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతుండగా, చివరి ప్యాకేజీ బిడ్ల దాఖలుకు నవంబర్ 23 తుది గడువుగా నిర్ణయించారు. బిడ్ల పరిశీలన, ఖరారు ప్రక్రియ ముగిసిన తర్వాతే క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుండటంతో ఈ ప్రాజెక్టులో కదలిక వచ్చింది. కేంద్ర రైల్వే శాఖ నిధుల కేటాయింపు, సాంకేతిక అనుమతులు చూస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూసేకరణ పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది. సాధారణంగా దేశంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం భూసేకరణ, నిధుల కొరత వంటి కారణాలతో నత్తనడకన సాగుతుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధితోనే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని అంటున్నారు. ఎప్పటికప్పుడు అవసరమైన నిధులను విడుదల చేస్తూ, క్షేత్రస్థాయి అడ్డంకులను తొలగిస్తేనే ప్రాజెక్టు అనుకున్న సమయానికి పట్టాలెక్కుతుంది. అమరావతికి కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రావడం రాజధాని అభివృద్ధిలో కీలక అడుగుగా భావిస్తున్నారు. అయితే భారీ రైల్వే స్టేషన్ ప్రతిపాదనలు ఎప్పుడు ఆమోదం పొందుతాయి? నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుంది?

ట్రూఅప్ ఛార్జీలు కూడా ఫ్రీ, 54.79 లక్షల మందికి ఊరట

హైదరాబాద్, తెలంగాణలో గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ పొందుతున్న 54.79 లక్షల కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లించనుంది. గతంలో విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటినా.. ప్రస్తుతం పథకం అర్హత ఉంటే ఈ మినహాయింపు వర్తిస్తుంది. దీంతో లబ్ధిదారులకు జీరో బిల్లులు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయం వల్ల వచ్చే రెండేళ్లలో ప్రభుత్వంపై సుమారు రూ.500 కోట్ల అదనపు భారం పడనుంది.తెలంగాణలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. ఉచిత విద్యుత్ పథకం కింద నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలపై ట్రూఅప్ ఛార్జీల భారం పడకుండా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హత పొందిన 54,79,383 విద్యుత్ కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే డిస్కంలకు చెల్లించనుంది. దీంతో ఈ నెల నుంచి అన్ని వర్గాల విద్యుత్ వినియోగదారుల బిల్లుల్లో ట్రూఅప్ ఛార్జీలు అదనంగా చేరుతున్నప్పటికీ గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం యథావిధిగా జీరో బిల్లులే జారీ అవుతున్నాయి.సాధారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీలను ఇప్పుడు వసూలు చేస్తున్నాయి. ఈ నెల బిల్లులో యూనిట్‌కు 30 పైసలు చొప్పున, వచ్చే నెల నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున మొత్తం 24 నెలలపాటు ఈ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయన

బీజేపీకి అప్రకటిత మిత్రోం ఓవైసీ !



లక్నో:ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ కలిసి సామాజిక పరివర్తన మోర్చా పేరిట కొత్త కూటమిని ప్రకటించడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మైనారిటీ, దళిత ఓట్లు చీలిపోవడం వల్ల సమాజ్‌వాదీ పార్టీ --కాంగ్రెస్ కూటమికి గట్టి దెబ్బ తగిలి, పరోక్షంగా బీజేపీకి లాభం చేకూరే అవకాశం ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఇండియా కూటమి 43 సీట్లు గెలుచుకోవడంలో 92 శాతం ముస్లింలు, 56 శాతం నాన్-జాటవ్ దళితుల మద్దతు కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ఒవైసీ-ఆజాద్ కూటమి రాష్ట్రంలో 3 శాతం నుంచి 7 శాతం మధ్య ఓట్లను చీల్చగలిగినా, అది పశ్చిమ , తూర్పు యూపీలోని హోరాహోరీ నియోజకవర్గాల్లో విపక్ష కూటమి విజయవకాశాలను దెబ్బతీస్తుంది.

పలు రాష్ట్రాల్లో మజ్లిస్ వల్ల దెబ్బతిన్నకాంగ్రెస్

గతంలో మహారాష్ట్ర, బీహార్ వంటి కీలక రాష్ట్రాల్లో ఎంఐఎం పోటీ వల్ల కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బీహార్‌లోని ముస్లిం ప్రాబల్యమున్న సీమాంచల్ ప్రాంతంలో మహాఘట్‌బంధన్ కూటమితో పొత్తుకు ఒవైసీ ప్రయత్నించగా, కాంగ్రెస్-ఆర్జేడీలు ఆ ప్రతిపాదనను తిరస్కరించాయి. ఫలితంగా 2020 , 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం సొంతంగా 5 స్థానాలను గెలుచుకోవడమే కాకుండా, మరో డజనుకు పైగా స్థానాల్లో మైనారిటీ ఓట్లను చీల్చి కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి అధికారంలోకి రాకుండా అడ్డుకుంది. 2025 బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 6 స్థానాలకే పరిమితమయింది.

కాంగ్రెస్ ఓటు బ్యాంకును కైవసం చేసుకుంటున్న మజ్లిస్

మహారాష్ట్రలోనూ ఎంఐఎం ఉనికి కాంగ్రెస్, ఎన్సీపీ కూటమికి గట్టి సవాలుగా మారింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఔరంగాబాద్ స్థానంలో ఎంఐఎం అభ్యర్థి ఇంతియాజ్ జలీల్ గెలుపొందగా, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మాలేగావ్ సెంట్రల్, ధులే సిటీ స్థానాలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. అంతేకాకుండా, 2026 ప్రారంభంలో జరిగిన మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 13 కార్పొరేషన్ల పరిధిలో ఎంఐఎం ఏకంగా 124 వార్డులను గెలుచుకుని, ఛత్రపతి శంభాజీనగర్ , మాలేగావ్ , నాందేడ్ , ముంబై వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టింది. అదేవిధంగా 2021 అహ్మదాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాలైన జమాల్‌పూర్, మక్తంపూరా పరిధిలో 7 వార్డులను ఎంఐఎం గెలుచుకోవడం కాంగ్రెస్‌కు నేరుగా నష్టం కలిగించింది. అస్సాంలో బద్రుద్దీన్ అజ్మల్ పార్టీతో, పశ్చిమ బెంగాల్‌లో అబ్బాస్ సిద్ధిఖీ నేతృత్వంలోని ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌తో ఎంఐఎం జతకడితే అక్కడా సెక్యులర్ ఓట్లు చీలిపోతాయన్న ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

మజ్లిస్ వల్ల బీజేపీకి లాభమే

కాంగ్రెస్, ఎస్పీ వంటి పార్టీలు ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకుంటూ నాయకత్వ అవకాశాలు ఇవ్వడం లేదని, అందుకే తాము సొంత రాజకీయ వేదికను నిర్మించుకుంటున్నామని ఒవైసీ వాదిస్తున్నారు. కానీ ఓవైసీ పోటీ వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరిగి బీజేపీ లాభపడుతోంది. మరోవైపు, తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎంఐఎం పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం వల్లే అక్కడ కాంగ్రెస్ గెలవగలిగింది. తెలంగాణలో ఉన్న రాజకీయం వేరు. పాతబస్తీలోకి మరో పార్టీని రానివ్వకూడదని.. తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీకి మజ్లిస్ మద్దతిస్తుంది. ఇతర చోట్ల కాంగ్రెస్‌ను దెబ్బకొడుతోంది.

ఛత్ పూజ వేళ రాజకీయ దుమారం!

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో ఛత్ పూజ వేడుకలు రాజకీయ వివాదానికి వేదికగా మారాయి. యమునా నదిలో పేరుకుపోయిన తెల్లటి విషపు నురగ మధ్య భక్తులు పూజలు నిర్వహిస్తున్న దృశ్యాలు తీవ్ర చర్చకు దారితీశాయి. నది ప్రక్షాళనపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేదంటూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విమర్శలు గుప్పించింది. దీంతో ఛత్ పూజ వేళ యమునా కాలుష్య అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కింది.

బీజేపీ హామీలు ఏమయ్యాయి?

ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్రంలోని పాలకులు యమునా నదిని శుభ్రం చేస్తామంటూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఆప్ ఆరోపించింది. వేలాది మంది పూర్వాంచల్ ప్రాంత భక్తులు ఛత్ పూజ కోసం యమునా నది ఘాట్లకు చేరుకోగా.. అక్కడ విషపు నురగ కనిపించడంపై ఆ పార్టీ తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టులు పెట్టింది.యమునాను శుభ్రం చేశామంటూ రేఖా గుప్తా ప్రభుత్వం చేస్తున్న ప్రచారం వాస్తవ పరిస్థితుల ముందు తేలిపోయిందని ఆప్ పేర్కొంది. విషపు నురగ మధ్య భక్తులు పూజలు నిర్వహిస్తున్న ఫొటోలను కూడా పంచుకుంది. బీజేపీ చెబుతున్న అభివృద్ధి, ప్రక్షాళన హామీలకు నదిలో కనిపిస్తున్న పరిస్థితులే నిదర్శనమని విమర్శించింది. 'ఇది ఏఐ సృష్టించిన దృశ్యం కాదు.. ఛత్ పూజ సందర్భంగా యమునా నది వాస్తవ పరిస్థితి' అంటూ వీడియోను షేర్ చేసింది. ఢిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ కూడా ఇదే వీడియోను పంచుకుంటూ బీజేపీ పాలనలో నది పరిస్థితి ఇదంటూ విమర్శించారు.

ఆప్ ఆరోపణలను తోసిపుచ్చిన బీజేపీ

మరోవైపు ఆప్ విమర్శలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. యమునా నది దుస్థితికి గత ఆప్ ప్రభుత్వమే కారణమని ఆరోపించింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నదిని సగానికి పైగా శుభ్రం చేసిందని పేర్కొంది. గతంలో ఛత్ పూజ నిర్వహణపై ఆంక్షలు ఉన్నాయని, ఇప్పుడు ఢిల్లీ



ముఖ్యమంత్రి స్వయంగా యమునా తీరంలో వేడుకల్లో పాల్గొంటున్నారని బీజేపీ ఎదురుదాడి చేసింది.

1,400 ఘాట్లలో వేడుకలు

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ఛత్ పూజ వేడుకలపై స్పందించారు. దశాబ్దాల తర్వాత ఢిల్లీలో ఇంత వైభవంగా ఛత్ పండుగ జరుగుతోందని పేర్కొన్నారు. యమునా నది పవిత్ర తీరంతో పాటు నగరవ్యాప్తంగా దాదాపు 1,400 ఘాట్లలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మంది భక్తుల భక్తిశ్రద్ధలు, ఛత్ పాటలు, సూర్యభగవానుడి ఆరాధనతో రాజధాని ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని ఎక్స్‌లో పోస్టు చేశారు.

కాలుష్యంపై రాజకీయ పోరు

ఛత్ పూజ సందర్భంగా యమునా నదిలో కనిపించిన విషపు నురగ ఇప్పుడు బీజేపీ, ఆప్ మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. నది ప్రక్షాళన విషయంలో ఎవరి హయాంలో ఎంత పురోగతి సాధించారనే అంశంపై ఇరు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. భక్తుల ఆందోళనకు కారణమైన యమునా కాలుష్య సమస్య మరోసారి దేశ రాజధానిలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

జనసేన అభ్యర్థులు వీరే...పోటీ ఆసక్తికరం

అమరావతి,ఏపీలో కూటమిలో రెండవ బలమైన మిత్రపక్షంగా ఉన్న జనసేనకు పొత్తులో భాగంగా నాలుగు మేయర్ పదవులతో పాటు 21 మునిసిపల్, నగర పంచాయతీ చైర్మన్ పదవులు దక్కాయి. ఏపీలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలలో 17 కార్పొరేషన్లు 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో జనసేనకు ఈ వాటా లభించింది. అయిదే పట్టణాల ఎన్నికలు తొలి దశలో కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయి. న్యాయపరమైన ఇబ్బందుల వల్ల కూడా వాటిని ఈ నెల 1వ తేదీన ఎన్నికలు జరగలేదు. అయితే ఇపుడు వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నెల 26న ఈ ఎన్నికలు ఉన్నాయి.

జనసేన తరపున రెడీ :

అయితే నాలుగు మేయర్లలో జనసేన తరపున పొత్తులలో కేటాయించిన మిగిలిన రెండు కార్పోరేషన్లకు మేయర్ అభ్యర్థులను తాజాగా ఎంపిక చేస్తూ అధినేత పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ వివరాలను జనసేన ఆదివారం రిలీజ్ చేసింది. దీని ప్రకారం చూస్తే 2 కార్పొరేషన్లు, 3 మున్సిపాలిటీలకు అభ్యర్థుల ఖరారు చేసినట్లుగా జనసేన పేర్కొంది. శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి, కాకినాడ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేర్లు ఖరారు చేశారు. అలాగే రాజాం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత, భీమవరం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం చైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను ఎంపిక చేసారు.

సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ :

ఇక మొదటి దశలో జనసేన పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీల చైర్మన్ స్థానాలన్నింటిలో ఘన విజయం సాధించింది. అలా పిఠాపురం, గొల్లప్రోలు, తుని, నిడదవోలు, నరసాపురం, పెడన, తిరువూరు,



చిలకలూరిపేట, సాలూరు, అమలాపురం, సామర్లకోట తదితర మునిసిపాలిటీలు ఉన్నాయి. అలాగే విజయవాడ, ఏలూరు కార్పోరేషన్ల మేయర్ పదవులు కూడా జనసేనను వరించాయి. దీంతో రెండో విడతలో కూడా సెంట్ పర్సెంట్ విజయాలను దక్కించుకోవాలని జనసేన వ్యూహ రచన చేస్తోంది. ఇక చూస్తే ఈ నెల 26న రెండవ దశలో ఎన్నికలు జరుగుతాయి. వీటి ఫలితాలను ఈ నెల 30న వెల్లడి చేస్తారు. దాంతో జనసేన అన్ని సమీకరణలు చూసుకుని రాజకీయంగా ధీటైన అభ్యర్థులను ఎంపిక చేసింది అని అంటున్నారు.

నారాయణపేట మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

నారాయణపేట,నారాయణపేట మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ లో అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. కాలేజీ యాజమాన్యం ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకుని హాస్టల్‌గా నిర్వహిస్తోంది. అగ్నిప్రమాదంలో విద్యార్థినుల వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. దట్టమైన పొగతో కొందరు విద్యార్థినులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదర్కొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలకు శాశ్వత రక్షణ కవచమా?



అమరావతి,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా ప్రకటించిన పెట్టుబడుల రక్షణ చట్టం ప్రతిపాదన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వాలు మారినా పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలు, భూముల కేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాలను మార్చకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలన్నది ఈ ప్రతిపాదనలోని ప్రధాన ఉద్దేశం.పెట్టుబడిదారుల్లో ప్రభుత్వాల మార్పుపై ఉండే భయాలను తొలగించడం, రాష్ట్రంలో పెట్టుబడులకు స్థిరత్వం కల్పించడం దీని వెనుక ఉన్న వాదన.పెట్టుబడులు రావాలి. పరిశ్రమలు రావాలి. యువతకు ఉద్యోగాలు రావాలి. ఇందులో ఎవరికీ రెండో అభిప్రాయం ఉండదు. ఒక ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిన చట్టబద్ధమైన హామీలను మరో ప్రభుత్వం రాజకీయ కక్షతో రద్దు చేయడం కూడా సరైన విధానం కాదు. కానీ ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న ఉంది. పెట్టుబడుల రక్షణకు, ప్రభుత్వాలు తీసుకున్న ప్రతి నిర్ణయానికి శాశ్వత రక్షణ కల్పించడానికి మధ్య తేడా లేదా?ప్రభుత్వం అంటే ప్రజల ఆస్తులకు యజమాని కాదు. ప్రజల తరఫున వాటిని నిర్వహించే బాధ్యత కలిగిన వ్యవస్థ మాత్రమే. లక్షల కోట్ల విలువైన భూములు, నీటి వనరులు, ప్రభుత్వ నిధులు, పన్నుల రూపంలో వచ్చే ఆదాయం అన్నీ ప్రజలవే.ఒక పరిశ్రమకు వందల ఎకరాల భూమి కేటాయించినప్పుడు, నీటిని కేటాయించినప్పుడు, విద్యుత్ రాయితీలు ఇచ్చినప్పుడు ప్రభుత్వం కొన్ని షరతులు విధిస్తుంది. నిర్దిష్ట సమయంలో పరిశ్రమ ఏర్పాటు చేయాలి, ఇంత పెట్టుబడి పెట్టాలి, ఇంతమందికి ఉద్యోగాలు కల్పించాలి, ఒప్పందంలోని నిబంధనలు పాటించాలి. ఇవన్నీ నెరవేర్చకపోతే ఆ కేటాయింపులను సమీక్షించే అవకాశం ఉండాలి కదా!కేవలం ఒక ప్రభుత్వం కేటాయించిందనే కారణంతో ఆ నిర్ణయం శాశ్వతంగా సరైనదైపోదు. భవిష్యత్తులో ఏదైనా అక్రమం బయటపడినా, ఒప్పంద ఉల్లంఘన జరిగినా, ప్రజాధనానికి నష్టం జరిగినా సమీక్షించకూడదా? అలాంటి అధికారాలను కూడా చట్టం పరిమితం చేస్తే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుంది?రాష్ట్రంలో భూముల కేటాయింపులపై ఇప్పటికే అనేక ప్రశ్నలు ఉన్నాయి. ఎకరాకు వంద రూపాయలకే భూములు కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాలు, వంద రూపాయల లీజుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అందించే ప్రతిపాదనలు చర్చకు వస్తున్నాయి. అమరావతిలో వందల ఎకరాల భూముల కేటాయింపులపైనా ప్రజల్లో ప్రశ్నలు ఉన్నాయి.ఇక్కడ సమస్య పరిశ్రమలకు భూములు ఇవ్వకూడదనో, ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించకూడదనో కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే.. ప్రజల ఆస్తులను ఎంత ధరకు, ఏ షరతులతో, ఎవరి ప్రయోజనం కోసం కేటాయిస్తున్నారు? వాటి వల్ల రాష్ట్రానికి వచ్చే లాభమెంత? ప్రజలకు కలిగే ప్రయోజనమెంత?ఒక పరిశ్రమకు భూమి ఇచ్చి పదేళ్లయినా పరిశ్రమ రాకపోతే ఏం చేయాలి? ఉద్యోగాల హామీ నెరవేరకపోతే ఏం చేయాలి? ఒప్పందంలో పేర్కొన్న పెట్టుబడి పెట్టకపోతే ఏం చేయాలి? ప్రభుత్వానికి నష్టం కలిగించేలా నిబంధనలు ఉల్లంఘిస్తే కూడా భూమిని వెనక్కి తీసుకోకూడదా? ఈ ప్రశ్నలకు చట్టంలో స్పష్టమైన సమాధానాలు ఉండాలి.పెట్టుబడుల పేరుతో ప్రజల ఆస్తులను కొద్దిమందికి అప్పగించి, భవిష్యత్తులో ఎవరూ ప్రశ్నించకుండా చేయడం కూడా సరైన విధానం కాదు.భూముల కేటాయింపుల్లో పారదర్శకత, పెట్టుబడుల అమలుపై పర్యవేక్షణ, ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన నిబంధనలు, ఒప్పందాల ఉల్లంఘనకు చర్యలు, ప్రజాధనానికి నష్టం కలిగితే విచారణకు అవకాశం ఉండాలి. అవినీతి, అక్రమాలు, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయాలకు రక్షణ ఉండకూడదు.పెట్టుబడిదారులకు భరోసా ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ప్రజల ఆస్తులకు, ప్రజాధనానికి రక్షణ కల్పించడం అంతకంటే పెద్ద బాధ్యత కాదా చంద్రబాబు గారూ?

శ్రీశైలంలోతగ్గిన నీటి నిల్వలు

శ్రీశైలం,శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా తగ్గుతున్నాయి. 215.80 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 48.57 టీఎంసీల నీరు మాత్రమే నమోదమయింది. 885 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి ప్రస్తుతం 829.10 అడుగులు వుంది. కేవలం 9 రోజుల్లో 3.03 టీఎంసీల మేర నీటి నిల్వలు తగ్గాయి. రోజుకు సగటున 0.33 టీఎంసీల నీటి తగ్గుదల నమోదయింది. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది.

అమరావతి...ఇతర ముఖ్యమంత్రులకు ఓ పాఠం !

అమరావతి:అమరావతి నిర్మాణం ప్రపంచ పట్టణీకరణ స్పెషలిస్టులకు, మార్పులను దశాబ్దాలుగా గమనిస్తున్న జర్నలిస్టులకు ఓ అద్భుతంగా కనిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో చూసిన తర్వాత వారు తమ అభిప్రాయాలను వెల్లడించకుండా ఉండలేకపోతున్నారు. తాజాగా సీనియర్ జర్నలిస్టు, ది ప్రింట్ ఎడిటర్ ఇన్ చీఫ్ శేఖర్ గుప్తా అమరావతిని పరిశీలించారు. చంద్రబాబును ఇంటర్వ్యూ చేశారు. ఆ తర్వాత తన అభిప్రాయాన్ని ఈ వారం తన చానల్‌లో వీడియో రూపంలో వెల్లడించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరికీ ఇదో పాడమని ఆయన నిర్మోహమాటంగా చెప్పారు.

భారీ ప్రాజెక్టుల విషయంలో వెనుకడుగు వేసే లీడర్స్

భారతీయ రాజకీయాల్లో ఏ నాయకుడైనా తాము అధికారంలో ఉండే ఒక్క ఐదేళ్ల పదవీకాలంలో పూర్తి చేయలేని భారీ ప్రాజెక్టులను చేపట్టేందుకు సాధారణంగా సాహసించరు. అలాంటిది ఒక నూతన రాజధాని నగరాన్ని నిర్మించడం అనేది అత్యంత దీర్ఘకాలిక ప్రక్రియ అయినప్పటికీ,చంద్రబాబు నాయుడు అమరావతి రూపంలో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని శేఖర్ గుప్తా ప్రశంసించారు. భారతదేశంలో కొత్త నగరాల నిర్మాణంపై లేదా ఉన్న నగరాలను ఆధునీకరించడంపై దశాబ్దాలుగా ఒక రకమైన అరుదైన వ్యతిరేక దృక్పథం ఉందని శేఖర్ గుప్తా అభిప్రాయపడ్డారు. మహాత్మా గాంధీ భావజాలం ప్రకారం గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలనే భావన ఉన్నప్పటికీ, నేటి ఆధునిక భారతదేశ వృద్ధికి నగరాల పాత్ర ఎంతో కీలకమని ఆయన నొక్కిచెప్పారు.

అధికారం కోల్పోయినా వెనక్కి తగ్గని చంద్రబాబు

2019 ఎన్నికల్లో అధికారం కోల్పోయినప్పటికీ, అమరావతి అనే మహా స్వప్నాన్ని చంద్రబాబు ఎప్పటికీ విడిచిపెట్టలేదని, నేడు మళ్లీ అధికారంలోకి వచ్చాక అదే ఆలోచనను మరింత వేగంగా ఆచరణలో పెడుతున్నారని ఆయన ప్రశంసించారు. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయంగా ప్రభుత్వాలు మారినా, అప్పటికి వెనక్కి తిప్పలేనంత వేగంగా అమరావతి నిర్మాణం జరుగుతోందని ఆయన విశ్లేషించారు. దేశంలో మౌలిక వసతుల కల్పనలో అతిపెద్ద సవాలుగా మారిన భూసేకరణ సమస్యను చంద్రబాబు తనదైన శైలిలో అధిగమించారని శేఖర్ గుప్తా ప్రశంసించారు. నేరుగా భూములు సేకరించడానికి బదులుగా భూ సమీకరణ విధానాన్ని తీసుకొచ్చి రైతులతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం ఆయన చేసిన మొదటి గొప్ప ప్రయోగమని పేర్కొన్నారు. రైతులు తమ భూమిని ఇచ్చేలా



ఒప్పించి, అభివృద్ధి చేసిన వాణిజ్య, నివాస ప్రాంతాల్లో వాటాలు కల్పించడంతో పాటు,రాజధాని తయారయ్యే వరకు రైతులకు ఎకరాకు ఏటా వార్షిక భృతి చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల దాదాపు 33,000 ఎకరాలను ఎలాంటి పెద్ద వివాదాలు లేకుండా సేకరించగలిగారని ఆయన వివరించారు.

ప్రైవేటు భాగస్వామ్యంతో అమరావతి – సీఎంలకు ఓ పాఠం

ఈ ప్రాజెక్టులో ప్రభుత్వానికి కేవలం కొన్ని చదరపు కిలోమీటర్ల మేర మాత్రమే నేరుగా భూమి ఉండటం రెండవ కీలక విశేషమని,ఇది ప్రైవేట్ భాగస్వామ్యంతో నగర నిర్మాణానికి మార్గం సుగమం చేసిందని శేఖర్ గుప్తా తెలిపారు. రాజకీయ మార్పుల వల్ల భవిష్యత్తులో పెట్టుబడిదారులకు ఎలాంటి నష్టం జరగకుండా, వారు నమ్మకం కోల్పోకుండా ఉండేలా తగిన భద్రత కల్పించడం మూడవ అంశమని ఆయన పేర్కొన్నారు. ఈ రకమైన రాజకీయ, పాలనాపరమైన సరికొత్త నూతన ఆవిష్కరణలతోనే చంద్రబాబు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ఈ భారీ నగరాన్ని నిర్మిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా, చంద్రబాబు నాయుడు చేపట్టిన అమరావతి నిర్మాణం కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే కాకుండా, దేశంలోని ఇతర ముఖ్యమంత్రులకు కూడా ఒక సాహసోపేతమైన ఆధునిక పాఠం అని శేఖర్ గుప్తా అభివర్ణించారు.రాజకీయ భయాలను పక్కన పెట్టి, సంపద సృష్టి జరగాలని, దాని ద్వారా ప్రభుత్వాలు మరింత వనరులను సమకూర్చుకుని ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించవచ్చని చంద్రబాబు నిరూపిస్తున్నారని ఆయన కొనియాడారు. అమరావతి కేవలం ఒక రాజధాని మాత్రమే కాదని, అది భారతదేశ పట్టణీకరణ భవిష్యత్తుకు ఒక దిక్సూచి అని శేఖర్ గుప్తా తన విశ్లేషణలో స్పష్టం చేశారు

తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ!



హైదరాబాద్,తెలంగాణ శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలు శనివారం(14వ తేదీ)తో ఖాళీ అయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. గవర్నర్ కోటాలో నామినేట్ అయిన ప్రముఖ ప్రజా కవి, గాయకుడు గోరటి వెంకన్న, మాజీ మంత్రి, సీనియర్ నేత బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీ కాలం పూర్తయింది. దీంతో గవర్నర్ కార్యాలయం వారికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఈ మూడు పదవులను భర్తీ చేయాల్సి ఉంటుంది.అయితే.. ఈ మూడు స్థానాలను వెంటనే భర్తీ చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం లేదని తెలుస్తోంది. గవర్నర్ కోటా నామినేటెడ్ స్థానాలు కావడంతో వీటి భర్తీకి ఎన్నికల సంఘం గడువు నిబంధనలు వర్తించవు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని.. దాని ప్రకారం.. గవర్నర్‌కు సిఫారసు చేయనుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన నాయకులు బయోడేటా, వారి గ్రాఫ్ ఆధారంగా గవర్నర్ ఎంపిక చేస్తారు. అయితే.. ప్రస్తుతం ఈ ఎంపిక ప్రక్రియ వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. దీనిపైనే ప్రభుత్వం సహా పార్టీ కూడా భారీ కసరత్తు చేస్తోంది.ముందుగా వివిధ కార్పొరేషన్లు, కమిషన్ల నామినేటెడ్ పదవుల భర్తీని పూర్తి చేసిన తర్వాతే, డిసెంబర్ రెండో లేదా మూడో వారంలో ఈ మూడు ఎమ్మెల్సీ పేర్లను ఖరారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భావిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్ పదవులను భర్తీ చేయడం ద్వారా ఎమ్మెల్సీ కోటాలో పోటీని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదేసమయంలో పార్టీకి అనుకూలంగా ఉన్నవారు.. వచ్చే ఎన్నికల నాటికి సామాజిక వర్గాల పరంగా పార్టీకి దోహదపడేవారు.. పార్టీకి విధేయులు ఇలా.. అన్ని కోణాల్లోనూ ఈ దఫా ఎమ్మెల్సీ అభ్యర్థులను వడపోయనున్నారు.ఖాళీ అయిన మూడు స్థానాల్లో ఒకటి పద్మశాలీ సామాజికవర్గానికి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సిరిసిల్ల సభలో ప్రకటించారు. మిగిలిన రెండు స్థానాలను బీసీ(మున్నూరు కాపు లేదా ముదిరాజ్), బ్రాహ్మణ లేదా ఎస్సీ(మాదిగ) వర్గాలకు కేటాయించే అంశంపై అధికార కాంగ్రెస్ పార్టీలో కసరత్తు జరుగుతోంది. ఇదిలావుంటే.. సుప్రీంకోర్టులో గతంలో దాఖలు చేసిన కేసుల విచారణ మరోసారి ఈ నెల 18న విచారణకు రానుంది. అప్పట్లో గవర్నర్ కోటా వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ కేసు రెండు సంవత్సరాలుగా విచారణ దశలోనే ఉంది. ఈ తీర్పును అనుసరించి.. ప్రభుత్వం కొత్తవారికి అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140